క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని నవులూరు షారోన్ ఆశ్రమ విద్యార్థులకు శనివారం అల్పాహారం పంపిణీ చేశారు. సినీ హీరో నందమూరి తారక రామారావు జన్మదినోత్సవం సందర్భంగా యర్రబాలెం వేప చెట్టు సెంటర్‌కు చెందిన తారక్ యూత్ ఆధ్వర్యంలో షారోన్ ఆశ్రమంలో కేకు కట్ చేసి చిన్నారులకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ గంగ, మహేష్, మణి తారక్, వంశీ తిరుమలరాజు, కోటి, శ్రీనివాసు, అజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఫిరంగిపురం: పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన మండలంలోని వేములూరిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని హైవే రోడ్డు పక్కన గల పాత రైసుమిల్లు వద్ద ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్న వ్యక్తులపై దాడిచేసి వారివద్ద నుంచి రూ.10,250 స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ తండాకు చెందిన దేవసోత్ పూర్ణేశ్వర్ నాయక్ స్థానిక ఫిరంగిపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మొదటి సంవత్సరం మూడు సబ్జెక్టులలో ఉత్తీర్ణుడు కాలేదు. దీంతో ఈనెల 17న రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఉదయాన్నే వచ్చి చూసిన తల్లిదండ్రులు కుమారుడు కన్పించకపోవడంతో చుట్టుపక్కల వారిని అడిగి జాడతెలియకపోవడంతో తండ్రి సైదానాయక్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు.

282 మంది వలంటీర్లకు సేవా పురస్కారాలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 282 మంది వలంటీర్లు ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికై నట్లు ఎంపీడీఓ డి.అనూరాధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 308 మంది వలంటీర్లు ఉండగా వారిలో 282 మంది పురస్కారానికి అర్హులైనట్లు చెప్పారు. వారిలో సేవా వజ్రకు ఇద్దరు, సేవా రత్నకు ఐదుగురు, సేవా మిత్ర పురస్కారాలకు 275మంది ఎంపికై నట్లు తెలిపారు. వారికి మండలంలో ఈనెల 22 నుంచి 24వరకు నిర్వహించే కార్యక్రమంలో పురస్కారం, నగదు అందజేస్తామన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి

ఫిరంగిపురం: ఫిరంగిపురం మాజీ సర్పంచ్ బొడపాటి వెంకటేశ్వరరెడ్డి(84) భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ శనివారం సందర్శించి నివాళులర్పించారు. వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. సురేష్ మాట్లాడుతూ గ్రామానికి సర్పంచిగా ఎనలేని సేవలు చేశారని చెప్పారు. మాజీ సర్పంచ్ కుమారులు, వైఎస్సార్ సీపీ నాయకులు బి.అంజిరెడ్డి, కోటిరెడ్డి, బొల్లారెడ్డిలకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట అబ్దుల్ గఫార్, కె.చిన్నప్పరెడ్డి, పి.జేమ్స్‌ఐన్నయ్య, చిట్టా అంజిరెడ్డి, డి.సురేష్, ఆర్.రంజన్‌బాబు, సర్పంచ్ మేడా బాబు, బి.అంజిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, ఇబ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్



తాడేపల్లిరూరల్: వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శనివారం కూడా కొనసాగింది. విద్యార్థులకు విద్యపై మోటివేషన్ తరగతి నిర్వహించారు. గ్రంథాలయ అధికారి షేక్ నాగుర్ బాష మాట్లాడుతూ ఖాళీ సమయాల్లో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి మంచి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

పేదలంటే ఇష్టం లేకనే బాబు దుర్మార్గపు వ్యాఖ్యలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- తాడికొండ అడ్డరోడ్డులో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



తాడికొండ అడ్డరోడ్డులో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ నాయకులు

తాడికొండ: పేదలు ఆర్థికంగా ఎదగడం ఇష్టం లేకనే ఇళ్ల స్థలాల పంపిణీపై శవం పూడ్చడానికి చాలదంటూ చంద్రబాబు దుర్మార్గపు వ్యాఖ్యలు చేస్తున్నాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా శనివారం తాడికొండ అడ్డరోడ్డు సెంటర్‌లో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా ఎదిగితే తనను దిక్కరిస్తారనే యోచనతో 14 ఏళ్ల పాలనలో పేదలను అణగదొక్కి కార్పొరేట్ సామ్రాజ్యాన్ని సృష్టించుకున్న బాబు ఇప్పుడు తన కోటలు కూలుతుంటే గగ్గోలు పెడుతున్నాడన్నారు. సెంటు ఇంటి స్థలం శవం పూడ్చడానికి చాలదంటున్న బాబు తమ పార్టీ నాయకులతో కలిసి ఓసారి గుంత తవ్వకొని ఎంతమందిని పూడ్చవచ్చో పరిశీలించుకోవచ్చన్నారు. బాబుకు రాజకీయంగా ఎప్పుడో ప్రజలు సమాధి చేశారని తెలిసినా అధికారం కోసం లేనిపోని అబద్ధాలు ఆడుతూ ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు సృష్టించేందుకు పడుతున్న తంటాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యం

- కళ్లం ఫౌండేషన్ నిర్వాహకులు గోవిందరెడ్డి
- ముగిసిన సెమీ ఫైనల్
- నేడు ఫైనల్ మ్యాచ్



బి.కుమార్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న గోవిందరెడ్డి

తాడేపల్లిరూరల్: క్రికెట్ పోటీల ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళ్లం ఫౌండేషన్ నిర్వాహకులు గోవిందరెడ్డి అన్నారు. తాడేపల్లి మండల పరిధి పెనుమాక గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. మొత్తం 64 జట్లు పోటీపడగా సెమీఫైనల్స్ ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ సీతా సీసీ, నాయక్ సీసీ జట్ల మధ్య ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనున్నది. సెమీ ఫైనల్స్‌లో సీతా సీసీ, ఆరా ఫౌండేషన్ జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా, సీతా సీసీ జట్టు 20 ఓవర్లలో 143 పరుగులు చేసి ఆలౌట్ కాగా, ఆరా ఫౌండేషన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 101 పరుగులు చేయడంతో సీతా సీసీ జట్టు ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బి.కుమార్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందజేశారు. ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా ఏపీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్త విజయ్‌కుమార్‌రెడ్డి, కళ్లం టెక్స్‌టైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అడిషనల్ కమిషనర్, స్టేట్ టాక్స్ కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు విచ్చేయనున్నారని తెలిపారు.

చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా జగనన్న పాలన

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- గడప గడపకు మన ప్రభుత్వం



తాడికొండలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఏపీలో జగనన్న పాలన కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం తాడికొండ-3 సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ ద్వారా అందిన సంక్షేమాన్ని వివరించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన మాటను తప్పకుండా నేడు ప్రతి సంక్షేమ పథకాన్ని పేదవాడికి అందించిన జగనన్న పేదల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచి ఉంటాడన్నారు. రాజధానిలో పేదవాడికి ఇళ్ల స్థలాలను కేటాయిస్తుంటే ఓర్చుకోలేక తప్పుడు కేసులు వేసి అడ్డుకోవాలని చూసిన చంద్రబాబుకు సుప్రీంకోర్టు తీర్పుతో తగిన శాస్తి జరిగిందన్నారు. రాజధాని అంటే ఏ ఒక్క వర్గానికో కాకుండా అన్ని వర్గాలకు స్థానం కల్పించిన జగనన్న పాలన ప్రతి ఒక్కరికీ ఆదర్శం అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి కోసం మూడు రాజధానుల ఏర్పాటు ప్రక్రియ కూడా జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తున్న జగనన్నకు గడపగడపలో ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని రాబోయే 30 సంవత్సరాలు జగనన్నే అధికారంలో ఉంటాడనడంలో సందేహం లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోకల సరోజినీ, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, వైఎస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పసుపులేటి వెంకట్రావు, మండల ఎస్సీ, యువజన విభాగం నాయకులు బోడపాటి ధర్మరాజు, ఆళ్ల హనుమంతరావు, బాకి వెంకటస్వామి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



చినపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని చిరువ్యాపారులకు శనివారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు(డీవీఆర్)లు తోపుడు బండ్లు, రిక్షా బండిని అందజేశారు. దుగ్గిరాల గ్రామానికి చెందిన జమ్ముల కోటయ్య, పెసర్లంక ప్రసాద్‌లకు తోపుడు బండ్లు, వీరంకి వెంకటేశ్వరరావుకి బల్ల రిక్షాను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాణావత్ కుషీభాయి, ఉప సర్పంచ్ గ్యాలం ఫణీంద్రయాదవ్, మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, ఆత్మకూరి నాగేశ్వరరావు, నాయకులు మేరుగ ఆనంద్, వెంకటేశ్వర నాయక్, శ్యాముల్, కర్పూరావు, లోకేష్, మహేష్, శశి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చినపాలెం గ్రామానికి చెందిన శిఖాపల్లి మరియమ్మకు రూ.10 వేలు, ఇదే గ్రామానికి చెందిన బుల్లా సురేష్ కుటుంబానికి రూ.10 వేలు, బీసీ కాలనీకి చెందిన పాలడుగు శ్రీనివాసరావుకు రూ.10 వేలు, దివ్యాంగురాలు తాడిబోయిన అంజలి కుటుంబానికి రూ.10 వేలు మొత్తం రూ.40 వేలు ఆర్థిక సహాయం ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించారు. ఈ మొత్తాన్ని బాధితులకు దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు కలసి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారావు, శిఖాపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామానికి చెందిన చిరువ్యాపారులు శృంగారపాటి నాగరాజు, ఆవుల పెద్దపోతురాజులులకు ఎమ్మెల్యే ఆర్కేకు తన సొంత ఖర్చులో రెండు తోపుడు బండ్లను అందజేశారు. వ్యాపారులకు తోపుడు బండ్లను ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుకూరి మేరమ్మ, ఉప సర్పంచ్ మధు నాగదుర్గ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పలుకూరి శామ్యూల్, మొండితోక సురేష్, మరీదు పెద్దబ్బాయి, వెంకట సుబ్బయ్య, కొప్పుల జాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



తాడికొండ: వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. శనివారం తాడికొండ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్ల సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వానికి సహకారంగా ఉంటూ ప్రతి పేదవాడికి అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్న వలంటీర్ల సేవలను గుర్తించి వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఉత్తమ సేవలు అందించిన పలువురు వలంటీర్లను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజినీ, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి జీవితం అందరికీ ఆదర్శనీయం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: 'శాలువా నా కెందుకు అరటిపళ్లు ఇస్తే ఒక పూట గడిచేదిగా' అన్న ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు నిరాడంబర జీవితం.. తెల్లదొరల తుపాకీ గుండుకు గుండెను ఎదురొడ్డిన వీరత్వం.. దేశ దాస్య విమోచన యజ్ఞంలో ఆంధ్రుల్ని ఒక్క తాటిపై నడిపించిన ఆయన మార్గదర్శకత్వం అందరికీ ఆదర్శమని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. ఆంధ్ర కేసరి, ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన నేతల్లో ప్రథముడైన టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా శంకర్ విలాస్ సెంటర్‌లోని ప్రకాశం చౌక్‌లో ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి తదితరులతో కలసి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడుగా టంగుటూరి ప్రకాశం పంతులును అభివర్ణించారు. పట్టుదలనే పెట్టుబడిగా చేసుకుని, గుండె దిటవునే సాధనంగా మలచుకుని, సమరమే ఊపిరిగా, దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా భావించి జూలు విదిల్చిన సింహమై జీవితం కొనసాగించిన మహోన్నతుడని కొనియాడారు. మహాత్ముడి పిలుపుతో కాసులు కురిపిస్తున్న ప్లీడరు వృత్తిని వదిలి జాతీయోద్యమంలో దూకిన నిస్వార్థ దేశభక్తుడని కొనియాడారు. స్వరాజ్య పత్రిక స్థాపనతో భారతీయుల్లో జాతీయ స్ఫూర్తిని రగిలిచ్చిన నిజమైన గాంధేయవాది అని పేర్కొన్నారు. తెలుగువారి తెగువకు నిలువెత్తు రూపం ప్రకాశం పంతులు అని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి శ్లాఘించారు. 'ప్రమాదములున్నచోటే ప్రకాశం పంతులు గారు ఉంటారు' అన్న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు భోగరాజు పట్టాభి సీతారామయ్య మాటలు అక్షర సత్యాలని పేర్కొన్నారు. 1922లో సహాయ నిరాకరణ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న సమయంలో 30వేల మంది స్వచ్ఛందకులతో గుంటూరులో భారీ ప్రదర్శన నిర్వహించారని.. తద్వారా గుంటూరుతో ఆయనకు గట్టి సంబంధం ఏర్పడిందని వివరించారు. దానికి గుర్తుగానే ఆనాడు తామంతా కమిటీగా ఏర్పడి, ఆయన పాదయాత్ర చేసిన ఈ ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ప్రకాశం చౌక్‌గా నామకరణం కూడా చేసినట్లు గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే పదవుల కోసం కాక ప్రజల కోసం పరితపించిన మహనీయుల్లో ప్రకాశం ముఖ్యుడని తెలిపారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడిగా నిలిచారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిలా దేశానికే కాక మంచి పాలకుడిగా రాష్ట్రానికి వన్నె తెచ్చిన టంగుటూరి సేవలు చిరస్మరణీయమని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, ప్రకాశం పంతులు విగ్రహ దాత సుధాకర్, కార్పొరేటర్ అంబేద్కర్, ఆంధ్రకేసరి అభిమాన సంఘం నేతలు ఐతి సతీష్, బందా శశి, శ్యామ్, హరిప్రసాద్, సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి, విజయమాధవి, సత్యవతి, విజయమ్మ, అరవ తిమ్మరాజు, నెరుసు శ్రీను, భాగ్యారావు, కిరణ్, మహేంద్ర గులేచా, రెడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, విద్యార్థులు

గుంటూరు మెడికల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు జిల్లా రీజనల్ అధికారి (ఈఈ) ఎం.నారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మిషన్ లైఫ్ 7 థీమ్స్ పేరుతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు మే 16న ప్రారంభమయ్యాయి. జూన్ 5 వరకు జరుగనున్నాయి. అందులో భాగంగా శనివారం గుంటూరు నగరంలో పర్యావరణ పరిరక్షణ అవగాహన కోసం విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, సిబ్బందితో కలసి గుజ్జనగుండ్ల నుంచి టీజేపీఎస్ కాలేజీ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ అధికారి ఎం.నారాయణ మాట్లాడుతూ మనిషి జీవితంలో పర్యావరణ పరిరక్షణ అనేది భాగమని చెప్పారు. ప్రతి ఒక్కరూ చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా, స్వచ్ఛమైన గాలి, వాతావరణం ఉండటం వల్ల ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై బాధ్యతతో మెలగాలని సూచించారు. ఇంధన వినియోగాన్ని తగ్గించి, ప్రతి ఒక్కరు తమ కార్యాలయాలకు చిన్నచిన్న పనులకు, సైకిల్ వినియోగించడం ద్వారా ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి చుట్టుపక్కల వారికి మేలు చేసిన వారవుతారని తెలిపారు. ప్రజలందరికీ అవగాహన కల్పించడానికి సైకిల్ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు, ఎనలిస్ట్ వి. వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జేసీ



పూజలు నిర్వహిస్తున్న జేసీ రాజకుమారి

నగరంపాలెం(గుంటూరు): లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర దేవస్థానంలో స్వామిని శనివారం సాయంత్రం జిల్లా సంయుక్త కలెక్టర్ (జేసీ) రాజకుమారి దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఆమెకు అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం జేసీని సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, చైర్మన్ పి.జయప్రకాష్‌రెడ్డి, అర్చకులు మురళీచంద్రకుమార్, ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

ఖాజీల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు కృషి

సంఘం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ రిజ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న రిజ్వాన్

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం ఖాజీల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఖాజీల సంఘం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ రిజ్వాన్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వ ఖాజీలందరూ జేఏసీగా ఏర్పడి ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు చెప్పారు. పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఖాజీల అసోసియేషన్ సమావేశాన్ని శనివారం సంఘ అధ్యక్షుడు ఖాజీ అబ్దుల్ అజీమ్ అధ్యక్షతను నిర్వహించారు. ఈ సందర్భంగా రిజ్వాన్ మాట్లాడుతూ ఖాజీలంతా మ్యారేజ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఒక ఖాజీ పని చేసే చోట మరొకరిని నియమించుకోవడాన్ని కూడా నిరోధిస్తామని చెప్పారు. ఖాజీలకు గుర్తింపు కార్డులతో పాటు హెల్త్ కార్డులు, నివాస గృహాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరతామని పేర్కొన్నారు. అనంతరం ఖాజీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, సంఘ నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఖాజీల సంఘం ఉపాధ్యక్షుడు ముఫ్తి ఖలీల్, కోశాధికారి ఇమామ్, ఏలూరు బాజీ, హుస్సేన్, ముఫ్తి జావీద్, తయ్యబ్, పలు జిల్లాల ఖాజీలు పాల్గొన్నారు.